# సింగిల్ పేజీ కథలు

## ఇది కథ కాదు

మా ఊరు తణుకు. నేను హైదరాబాద్ హైకోర్టులో ప్లీడరుగా పనిచేస్తున్నాను. మా ఊరంటే నాకు ప్రాణం. అక్కడ నుంచి ఏ క్లయింటు వచ్చినా వాళ్ల కేసు నా సొంత కేసులా భావించి వారికి న్యాయం చేకూర్చాలని ఆదుర్దా పడతాను.

ఒక రోజు మధ్యాహ్నం నేను క్యాంటీన్‌లో కాఫీ తాగుతూంటే ఒక అపరిచిత వ్యక్తి వచ్చి "సార్, మీ అన్న తిలక్‌గారి మిత్రుణ్ని. ఇద్దరం కలసి తణుకు హైస్కూలులో చదువుకున్నాం. మీ ముఖం చూడ గానే తిలక్‌గారి తాలూకా అని చొరవతీసుకుని మమ్మల్ని పలకరించాను. నాదొక క్రిమినల్ కేసు ఉంది. ఆ కేసు చదివి, నాకు హైకోర్టులో మీరు సాయం చేయమని ప్రార్థిస్తున్నాను" అని ఎంతో విన మ్రంగా అభిమానంగా అడిగాడు. సాయంకాలం ఇంటికి వచ్చి కలవమని చెప్పి నా ఎడ్రసు, ఫోను నెంబరు ఇచ్చాను.

సరిగ్గా నాలుగు గంటలకు మూర్తిగారు రికార్డు తీసుకుని వచ్చారు. మనిషి చాలా నిస్పృహలో ఉన్నాడు.

"ఏమిటి విషయం?" అని అడిగాను.

చాలా పెద్ద రికార్డు. రికార్డులోంచి అవసరమైన పేపర్లు తీసి ఒక్కొక్కటే నాకు ఇచ్చాడు. "నేను రెవెన్యూ శాఖలో చిన్న ఉద్యోగిని. నా జీతం నెలకు 150 రూపాయలు. నాకు ఇద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడ పిల్లలూ ఉన్నారు. జీతం మా జీవనోపాధికే సరిపోదు. దానికి తోడు దురదృష్టవశాత్తు నా మీద 3 సెక్యూరిటీ కేసులు ఏలూరులో పెట్టారు. మా ఊరికి ఇంచు మించు సాక్షిని తీసుకుని కోర్టులో హాజరుకావల్సి ఉంది. సాక్షికి భోజనం టిక్కెట్టు నేనే పెట్టుకోవాలి. క్రితం ఆరు నెలల నుంచి కేసు ఎప్పటికప్పుడు వాయిదా పడుతూంది. ఈ ఖర్చు భరించే శక్తి నాకు లేదని" విలపించాడు. తన పిల్లలకు రెండు పూటల కడుపు నిండా భోజనం పెట్టలేకపోతున్నానని ఎంతో మదనపడ్డాడు. ఉన్నట్టుండి ఒక్కసారి ఆయన కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. సిగ్గు వదిలి నా కాళ్ల మీద పడి తనను ఎలాగైనా రక్షించాలని, ఫీజు ఎంతైనా తన తల తాకట్టు పెట్టయినా ఇచ్చుకుంటానని, ఈ నరకం లోంచి బయటపడేయమని బ్రతిమాలుకున్నాడు. ఆయన్ని చూస్తే ఎవరికైనా జాలి కలుగుతుంది. శ్రద్ధగా పేపర్లు అన్నీ చదివి చూస్తే పోలీసులు తీసు కున్న సాక్ష్యానికి, కోర్టులో పెట్టిన చార్జీలకు సంబంధం కనిపించలేదు. ఈ కేసులు నిజంగా ఇతన్ని బాధపెట్ట డానికి కల్పించి పెట్టిన కేసుల్లా కనిపించాయి.

"చార్జీలకూ సాక్ష్యానికి పొత్తు కుదరటం లేదు. హైకోర్టులో క్వాష్ ప్రొసీడింగ్స్ వేస్తే మీరు తప్పక నెగ్గు తారు. కింద కోర్టులోని కేసులన్నీ ఒకేమారు కొట్టివే స్తారు. అంతవరకూ నేను మీకు వక్కాణించి చెప్పగ లన"ని ఆయనతో చెప్పాను.

"నిజంగా. అంత అదృష్టమే నా బ్రతుక్కి. దేవు డంటూ ఉన్నాడో లేడోకానీ మీరు ఇప్పుడు, నన్ను ఆదుకుందుకు వచ్చిన భగవంతుడులా కనిపిస్తు న్నాడు" అంటూ కళ్ల నిండా చేరిన అశ్రువుల్ని తుడు చుకుంటూ కుర్చీలోంచి ఒక్కసారి లేచి నా కాళ్లు రెండూ పట్టుకొని బొటబొటా కన్నీళ్లు కార్చాడు. నిరాశ నిస్పృహలో ఉన్న మూర్తిగారికి హృదయంలో ఆశ పుట్టుకొచ్చింది. నాకు ఎన్నోసార్లు అభినందనలు చెప్పాడు. ఆయన తరపున నేను కేసులు వేయటం జరిగింది.

శుక్రవారం 11 గంటలకు జడ్జి పార్థసారథిగారి దగ్గర ఈ మూడు కేసులు హియరింగుకి వచ్చాయి. సాక్ష్యానికి పెట్టిన చార్జీలకు సమన్వయం లేదని, కేసులో పెట్టిన సాక్ష్యం చార్జీలను బలపరచటం లేదని ఇదే జడ్జిగారు, జడ్జి కాకముందు మద్రాసు హైకోర్టులో తాను చేసిన కేసును గురించి ఆ కేసు లా జర్నల్‌లో కూడా రిపోర్టు అయిందని ఆయన నాకు చెప్పగానే, ఆయనకు రిపోర్టు అయిన కేసు తీసి చూపించాను. ఆయన మూర్తిగారి కేసులో సాక్ష్యం చార్జీలు పూర్తిగా చదివిన తర్వాత ఈ కేసులో చార్జీలు నిరూపించడానికి కావలసిన సాక్ష్యం లేదని మూర్తిగారి మీద పెట్టిన మూడు కేసులు కొట్టివేస్తానని చెప్పారు. కానీ ఆ రోజున పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గారికి నోటీసు ఇవ్వాల్సి వచ్చింది. అందుకని ఈ కేసులు సోమవారం నాటికి పోస్టు చేయమని జడ్జిగారు ఆర్డరు వేశారు.

ఎప్పుడైతే జడ్జిగారు కింద కోర్టులో పెట్టిన కేసులు కొట్టివేస్తానని చెప్పారో, అప్పుడు మూర్తిగారి ఆనందా నికి అవధుల్లేవు. ఆయన తిరిగి సోమవారం పొద్దున్న వస్తానని సెలవు తీసుకుని వెళ్లిపోయాడు.

సోమవారం ఉదయం మూర్తిగారు కోర్టులో కలి శారు. నాలో నిరుత్సాహం చూసి "అలా ఉన్నారేం ప్లీడ రుగారూ" అని అడిగాడు.

"మూర్తిగారూ... మీరు నిజంగా దురదృష్టవం తులు. ఎందుకంటే ఈ కేసులు విన్న జడ్జి పార్థసారథి గారు మారిపోయారు. ఇది ఇంకో జడ్జిగారి దగ్గర వేశారు. ఆయన ఏం చేస్తాడో" అన్నాను. మూర్తిగారు ఒక్కసారి అవాక్కయిపోయాడు. 10 నిమిషాల వరకూ ఇలా కేసులు వేసిన జడ్జిగారు రాలేదు. కోర్టు హాలులో అలజడి ప్రారంభమైంది. ఏమిటా అని వాకబు చేస్తే జడ్జిగారు రావటం లేదని, ఈ కేసులన్నీ తిరిగి పార్థసా రధిగారే వింటారని నోటీసు పెట్టారు. ఆహా! అదృష్టం వచ్చినట్లే వచ్చి మాయమయింది. మళ్లీ అదే అదృష్టం మూర్తిగారికి కలిసి వచ్చింది. జడ్జి పార్థసారధిగారు మూర్తిగారి మీద పెట్టిన 3 సెక్యూరిటీ కేసులు కొట్టివే శారు. కించిత్ అదృష్టం ఉంటే కానీ క్లయింట్ కేసు నెగ్గడం కష్టమే అనుకుంటారు.

-దేవరకొండ పార్థసారధి (హైదరాబాద్)

***

## జాతస్య మరణం ధృవం

అది అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారిగా ద్వారకానాథ్ పనిచేస్తున్న రోజులు. ఆయనంటే చదు వుకునే విద్యార్థులకే కాక, చదువుచెప్పే అయ్యోర్లకు కూడా గుండె దడ. ఎక్కడా రాజీలేని ధోరణి ఆయనది. 'చండశాసనుడు', 'యముడు' అనేవి టీచర్లు ఆయ నకు తగిలించిన బిరుదులు. కానీ ఆయన దానికి గర్వ పడేవాడే కానీ బాధపడేవాడు కాదు. ఆయన స్కూళ్ల తనిఖీకి వచ్చినపుడు ఎప్పుడూ కూడా అధికార లాంఛ నాలతో రావడం జరగలేదు. సాదాసీదాగా ఉన్నట్టుండి స్కూల్లో ఏ తరగతి గదిలోనో ప్రత్యక్షమయ్యేవాడు. ఆ తరువాతే మిగిలిన వారిని కలిసేవాడు. ఒక్కొక్కసారి పాఠశాల తెరవక ముందే వచ్చి టీచర్ల సమయపాల నను పరీక్షించేవాడు. ఆయన వేరే జిల్లాకు బదిలీ కావా లని టీచర్లు బహుశా ముక్కోటి దేవతలకు ముడు పులు కట్టుకొని ఉండొచ్చు. కానీ అవి ఇంకా నిజాయి తీకి విలువనిచ్చే రోజులు. కనుక వారి ఆశ చాలా కాలం తీరకనే ఉండిపోయింది.

ఒకసారి అకస్మాత్తుగా జిల్లా కేంద్రంలో ఉన్న పాఠ శాల తనిఖీకి ద్వారకానాథ్ వెళ్లడం జరిగింది. ఆ పాఠశా లలో విద్యార్థుల సంఖ్య ఐదొందల పైచిలుకే. కానీ ఆ రోజు ఆయనకు అక్కడ ఒక్క విద్యార్థి గానీ, టీచర్‌గానీ